కళా కౌముది కోకనాడ



సినిమా చిత్రీకరణలో యువత

- సాంస్కృతిక నందన వనంలో ఎన్నో మణిమాణిక్యాలు
- ప్రజ్ఞావంతుల మార్గదర్శకంలో దూసుకుపోతున్న నేటి యువత



నృత్య ప్రదర్శనలో కాకినాడ చిన్నారులు

కాకినాడ కల్చరల్: మర్రిచెట్టు కింద ఏ మొక్కా మొలవదన్న సామెత అందరికీ తెలిసిందే. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరం మాటున అంత కంటే ఎంతో ప్రజ్ఞావంతులున్న కాకినాడ నగరం పేరు మసకబారిందనే చెప్పాలి. సంగీత, సాహిత్య, నాటక, నాట్య, వాయిద్య తదితర కళల్లో పెద్దాడ సూర్యకుమారి, డాక్టర్ ఈవీ కృష్ణ మాచార్యులు వంటి ప్రముఖ సంగీత విద్వాంసులే కాకుండా, సినీ గీతాలతో కాకినాడ ప్రజలనే కాక ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రాన్ని ఉర్రూతలూగించిన గంగాధర్, ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ప్రవచన కర్తలు చాగంటి కోటేశ్వరరావు, గరికపాటి నరసింహారావు, స్వామి పరిపూర్ణానంద సరస్వతి వీరంతా కాకినాడ వాస్తవ్యులే. అలాగే వివిధ కళారంగాల ప్రముఖులు వారి శిష్య బృందాలను విశ్వ వ్యాప్తం చేస్తూ కాకినాడ ప్రతిభను నిలబెడుతున్నారు. మదిమదిలో హాయి గొలిపే చంద్రుని కళల వంటి సాంస్కృతిక కళల వారసత్వాన్ని స్థానిక కళాకారులు విశ్వవ్యాప్తం చేస్తున్నారు.

సంగీతంలో రాణిస్తున్న యువత..



సంగీతంలో నేటి యువత మక్కువ పెంచుకుని భారత సంస్కృతీ వారసత్వాన్ని నిలబెడుతున్నారు. మంజరి సంగీత కళాశాల ఏర్పాటు చేసి ఎంతో మందికి శిక్షణ ఇస్తున్నాం. ప్రాచీన కళాకేంద్రం (చండీఘర్ యూనివర్సిటీ) ద్వారా సంగీతంలో వివిధ విభాగాలలో డిప్లమో కోర్సులు నిర్వహిస్తూ ఎంతో మంది ఉద్యోగ, ఉపాధికి బాటలు వేస్తున్నాం. కాకినాడలో కళలకు మంచి గుర్తింపు ఉంది.

డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు,
సంగీత విద్వాంసులు, కాకినాడ

అంతర్జాతీయ వేదికలపై కాకినాడ ప్రతిభ



కాకినాడ నర్తకీమణులు అంతర్జాతీయ వేదికలపై ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి స్వర్ణ పతకాలు సాధిస్తున్నారు. వారికి నాట్యాచార్యగా చాలా సంతోషంగా ఉంది. ఉన్నత చదువులు అభ్యసిస్తూనే మరో వైపు నాట్యంలోనూ రాణిస్తున్నారు. ఇంతటి ఖ్యాతి కాకినాడకు చేకూరిందని చెప్పడం అతిశయోక్తి కాదు.

డాక్టర్ కృష్ణకుమార్,
నాట్యాచార్య, కూచిపూడి నాట్యాలయ,కాకినాడ.

సంగీతంపై మక్కువ పెంచాలి



యువతను సన్మార్గంలో నడిపించే కళలపై యువత దృష్టి పెట్టాలి. సాహిత్యానికి కాకినాడ గొప్ప వేదిక. కాకినాడ కేంద్రంగానే దేవులపల్లి కృష్ణశాస్త్రి కవితా లోకానికి పరిచయమై భావకవితా చక్రవర్తిగా పేరొందారు. ఔత్సాహిక కవులకు ఇక్కడ కొదవులేదు. రచయిత, ఐడియల్ కళాశాల కరస్పాండెంట్ చిరంజీవిని కుమారి ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం ద్వారా ఎందరో యువ రచయితలను సాహితీ లోకానికి పరిచయం చేసారు. కాకినాడలో యువతరాన్ని సాహిత్యం వైపు నడిపించేందుకు ఎన్నో సంస్థలు పోటీ పడుతున్నాయి.

ర్యాలి ప్రసాద్, రచయిత,కాకినాడ

నటన వైపు యువత మొగ్గు



కాకినాడ నటులకు నిలయమన్న విషయం యావత్ ఆంధ్రదేశానికి తెలిసిందే. అంజలీదేవి, ఎస్వీ రంగారావు, సూర్యకాంతం వంటి సీనియర్ నటులు దంటు కళాక్షేత్రంలో శిక్షణ పొంది సినీలోకాన్ని ఏలిన వారే. నగరానికి చెందిన కాటమ రెడ్డి, కృష్ణారెడ్డి, మణిబాల తదితరులు చిత్ర రంగంలో రాణించడం కాకినాడకే గర్వకారణం. యువ నటులకూ కాకినాడలో కొరత లేదు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఇటీవల చిత్ర నిర్మాణాలు పెరుగుతుండడంతో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు.

డాక్టర్ సి.ప్రసాద్, నటుడు, దర్శకుడు, కాకినాడ

జగనన్న సురక్షతో ప్రజాసేవ



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- పలువురికి ధ్రువపత్రాల పంపిణీ

కరప: ప్రజా సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారానికే జగనన్న సురక్ష అమలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. నడకుదురు-1 గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి, వినూత్న కార్యక్రమాలకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వచ్చినప్పుడే కాకుండా, ప్రజలు ఎక్కడికీ వెళ్లక్కర్లేకుండానే, 1902కు ఫోన్‌చేసి, తమ సమస్యలు తెలిపితే, వాటి పరిష్కరించేందుకు జగనన్నకు చెపుదాం కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్టు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలతో పారదర్శక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు అండగా ఉండాలని ఎమ్మెల్యే కన్నబాబు కోరారు. సచివాలయం-1 పరిధిలో 442 మందికి నివాస, ఆదాయ, కుల, ఆధార్‌వంటి వివిధరకాల సర్టిఫికెట్లను స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే అందజేశారు. సర్పంచ్ డేగల లలితకుమారి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మమ్మిడి బుచ్చిబాబు, పైలా రామతులసి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, పైలా గోవిందు, పోతల లోవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవల కోసమే..

కాకినాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు అనేక సేవలు అందుతున్నాయని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన రాజా రామ్మోహన్‌నగర్, చిన్నమార్కెట్, యాళ్లవారివీధి, దుగ్గిరాలవారి వీధి, ట్రెజరీకాలనీ సచివాలయాల్లో ఈ కార్యక్రమం అమలును పర్యవేక్షించారు. ఆయా సచివాలయాల పరిధిలో 1755 మందికి సర్టిఫికెట్లు అందిస్తున్నట్టు కమిషనర్ తెలిపారు. ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని ఆయన వెంట ఉన్నారు.

ఇంద్రపాలెం, గంగనాపల్లి గ్రామాల్లో

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం, గంగనాపల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష సభలను మంగళవారం నిర్వహించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఇంద్రపాలెం సచివాలయం - 1 పరిధిలో జరిగిన కార్యక్రమంలో 423 దరఖాస్తులకు 412 సర్టిఫికెట్లను ఎంపీడీఓ స్వప్న, తహసీల్దార్ మురార్జీ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను పంపిణీ చేశారు. గంగనాపల్లి సచివాలయం-2 పరిధిలో సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ గీసాల మహాలక్ష్మి, గీసాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి



లబ్ధిదారుకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

గడప గడపకూ కార్యక్రమంలో ద్వారంపూడి

కాకినాడ: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రాతిపదికగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 6వ డివిజన్ రేచర్లపేట ప్రాంతంలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ గతంలో జన్మభూమి కమిటీలు ద్వారా ముడుపులు చెల్లిస్తే తప్ప ప్రజలకు అందని సంక్షేమ ఫలాలు తమ ప్రభుత్వంలో నేరుగా లబ్ధిదారుల ఇంటికి గానీ, ఖాతాల్లో గానీ జమ అవుతున్నాయన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ మళ్లీ ఆశీర్వదించాలన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి కొంతం శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బండి సత్యనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు అందించాం..

కాకినాడ రూరల్: ఇళ్లు లేని పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అర్హులందరికీ ఇళ్ల స్థలాలను అందించామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. మండలంలోని ఇంద్రపాలెం గ్రామంలో సచివాలయం - 1 పరిధిలో అభయాంజనేయ గుడి వీధి, గోశాల ప్రాంతంలో మంగళవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాలు వివరించి ఏ మేరకు లబ్ధి పొందారో వివరించారు. ఎన్నికల సంవత్సరం కావడంతో వివిధ పార్టీల నాయకులు మీ వద్దకు వస్తారని వారిని నమ్మవద్దని, మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అయ్యేలా, తానను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, పలివెల శ్రీను, గోపుశెట్టి బాబ్జీ, ఎంపీడీఓ స్వప్న, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎవరండీ?

నాయకులను నిలదీసిన టీడీపీ కార్యకర్తలు

కాకినాడ రూరల్: టీడీపీ నియోజకవర్గస్థాయి సమావేశం ఇన్‌చార్జి ఎవరన్న ప్రశ్నతో రసాభాసగా ముగిసింది. వివరాల్లోకి వెళ్తే మంగళవారం స్థానిక రమణయ్యపేట ఒకటో డివిజన్‌లో కార్పొరేషన్ కల్యాణ మండపంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పేరాబత్తుల రాజశేఖర్ తదితరుల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీలో రెండు వర్గాలు ఉన్నాయని ఇన్‌చార్జి ఎవరని కార్యకర్తలు నిలదీశారు. పిల్లి అనంత లక్ష్మి టికెట్ తమదే అంటున్నారని వారన్నారు. దీంతో నేతలు టికెట్ ఎవరికీ ప్రకటించలేదని, గతంలో అధికారంలో ఉన్నపుడు ప్రజలను పట్టించుకోని ఆమె నేడు టికెట్ తనదే అన్నప్పటికీ పట్టించుకోవద్దని సూచించారు. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో తిరుగుతూ ఆమె అయోమయంలోకి నెడుతున్నారని పార్టీ మండల అధ్యక్షుడు సీతయ్యదొర పేర్కొన్నారు. ఇన్‌చార్జి నియామకాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు.

శాకంబరి ప్రసాదం పంపిణీ

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం అమ్మవారి శాకంబరి ప్రసాదాన్ని ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి భక్తులకు పంపిణీ చేశారు. సోమవారం అమ్మవారిని ఐదు టన్నుల కూరగాయలు, వివిధ రకాల పండ్లతో శాకంబరిగా అలంకరించిన విషయం తెలిసిందే. ఈ కూరగాయలను భక్తులకు పంపిణీ చేశారు.

రోశయ్య సేవలు చిరస్మరణీయం



వస్త్రదానం చేస్తున్న పెద్ది రత్నాజీ తదితరులు

కాకినాడ: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య రాష్ట్రానికి అందించిన సేవలు ఆదర్శప్రాయమని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు, గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పెద్ది రత్నాజీ పేర్కొన్నారు. స్థానిక వైఎంవీఏ హాలులో మంగళవారం రోశయ్య 90వ జయంతిని ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధి లింగమల్లు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రత్నాజీ మాట్లాడుతూ రాజకీయాల్లో తనదైన ముద్రవేసుకుని ప్రజలకు రోశయ్య మంచి సేవలు అందించారన్నారు. త్వరలో కాకినాడలో రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అధ్యక్షుడు లింగమల్లు కృష్ణమూర్తి, రాష్ట్ర మహిళా ఆర్యవైశ్య అధ్యక్షురాలు నాళం ఆండాళ్, ఆర్యవైశ్యమహాసభ అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాదం మధు పాల్గొన్నారు. పారిశ్రామికవేత్త కంతేటి కాశి ఆధ్వర్యంలో పేదలకు వస్త్రదానం, పండ్లు పంపిణీ చేశారు.

అల్లూరి పోరాట స్ఫూర్తితో లక్ష్యసాధన

కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి నివాళులు



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ రూరల్: నేటి యువత అల్లూరి పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని లక్ష్యాన్ని సాధించావని కలెక్టరు కృతికా శుక్లా పేర్కొన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను కాకినాడ నాగమల్లి జంక్షన్ వద్ద జిల్లా ట్రైబల్ వెల్ఫేర్, సెట్రాజ్ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం అధికారికంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కలెక్టరు డాక్టరు కృతికా శుక్లా, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, తదితరులు పూల మాలలు వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు త్యాగం తెలుగు వారి గుండెల్లో ఎప్పుడూ నిలిచి ఉంటుందన్నారు. కురసాల కన్నబాబు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ప్రారంభించిన నాటి నుంచి అల్లూరి జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో అల్లూరి బ్రిటిష్ సైనికులపై అసమానమైన ధైర్య సాహసాలు చూపారన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, సోషల్ వెల్ఫేర్ జేడీ రమణమూర్తి, డీటీడబ్ల్యూఓ ఎ.విజయశాంతి, సెట్రాజ్ మేనేజరు కాశీ, అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు కర్రి అచ్యుతరామారెడ్డి, కార్యదర్శి పంపన దయానందబాబు, గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, క్షత్రియ పరిషత్ మాజీ అధ్యక్షుడు పాకలపాటి వెంకట సత్యనారాయణ రాజు(యువరాజు), క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు అడ్డూరి భాస్కరరాజు, రమణయ్యరాజు, మూర్తి రాజు, బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో..

కాకినాడ క్రైం: అల్లూరి సీతారామరాజు జయంతిని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. దేశం కోసం అల్లూరి చేసిన త్యాగాన్ని ఆయన కొనియాడారు.



అల్లూరికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

తూరంగిలో..

కాకినాడ సిటీ: రూరల్ మండలం తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు కాలనీ అభివృద్ధి కమిటీ నివాళులు అర్పించింది. కమిటీ కన్వీనర్ చింతపల్లి అజయ్‌కుమార్, విశ్రాంతి ఎంపీడీవో కె.విశ్వనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డూరి అవ్యక్త, పాటూ్నరి జయప్రకాష్, వేపాడ వాసు, శ్రీను, చింతపల్లి విజయ, ఇళ్ల వెంకీ, కణితి రాంబాబు, ఎం శివాజీ తదితరులు అల్లూరి విగ్రహానికి నివాళులర్పించారు. అల్లూరి ఏకపాత్రాభినయాన్ని పెమ్మాడ గీతేశ్వర్ ప్రదర్శించి మెప్పు పొందాడు. విజేతలకు వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డూరి అవ్యక్త బహుమతులు అందజేశారు.

బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో..

బోట్‌క్లబ్: బీజేపీ యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డి వీరేంద్ర ఆధ్వర్యంలో స్థానిక సూర్యనారాయణపురంలో అల్లూరికి నివాళులు అర్పించారు. ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణ, దక్షిణ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్, నాయకులు మాలకొండయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కరపలో..

కరప: మండలంలోని పలు గ్రామాల్లో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంపీడీఓ కె.అప్పారావు సిబ్బందితో కలసి అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఏఓ గుత్తుల భీమశంకరరావు, ఏపీఓ ఇ.వెంకటరమణ, వీరేష్, రాయుడు, సురేష్, పి.శ్రీనివాస్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పెంకే సత్తిబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తప్పులు లేని ఓటర్ల జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించేందుకు సంబంధిత బీఎల్‌ఓలు, అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన ఏటిమొగలో పర్యటించి అక్కడ కొన్ని నివాసాల్లోని ఓటర్ల జాబితాను తనిఖీ చేశారు. 47-3-25/18 డోర్ నెంబర్‌లో 44 ఓట్లు ఉన్నట్టు గుర్తించారు. వేర్వేరు కుటుంబాలు ఉన్నప్పటికీ డోర్ నెంబర్లు విడిగా లేకపోవడం వల్ల ఒకే చోట చూపిస్తున్నట్టు తేల్చారు. ఆయా కుటుంబాలకు వేర్వేరు డోర్ నెంబర్లు ఇచ్చి విభజించాలని డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసును ఆదేశించారు. అనంతరం స్మార్ట్‌సిటీ సమావేశ మందిరంలో ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలతో వివిధ అంశాలపై సమీక్షించారు. పదికన్నా ఎక్కువ మంది ఒకే డోర్ నంబరులో ఉంటే వారిని గుర్తించాలని సూచించారు. అనంతరం వాస్తవికతను పరిశీలించి వేర్వేరు డోర్ నెంబర్లను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వందేళ్ల వయసున్న ఓటర్లను కూడా విచారించి పరిశీలించాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, సర్వేయర్ ఆచారి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమాచార హక్కు ఫిర్యాదుపై విచారణ



ఫిర్యాదుపై విచారణ జరుపుతున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వేళంగి గ్రామస్తుడు కుంచే రామచంద్రరావు సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన ఫిర్యాదుపై ఎంపీడీఓ కె.అప్పారావు విచారణ జరిపారు. వేళంగిలో ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి షాపులు నిర్మించారని, ప్రభుత్వ స్థలం ఎంత ఉంది, ఎవరెవరు ఆక్రమించుకున్నదీ, ఆక్రమణలు తొలగించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యదర్శి పి.శ్రీనివాస్ ఇచ్చిన సమాచారంపై ఫిర్యాదు దారుడు సంతృప్తి చెందకపోవడంతో ఫిర్యాదును ఎంపీడీఓ కార్యాలయానికి పంపారు. ఈ మేరకు ఎంపీడీఓ అప్పారావు ఈ ఫిర్యాదుపై పూర్తి విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే పది రోజుల్లో సమాచారం ఇస్తామని రామచంద్రరావుకు ఎంపీడీఓ తెలిపారు.

78 మంది రక్తదానం



రక్తదానాన్ని ప్రారంభిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ హేమలతాదేవి

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో మంగళవారం రక్తదానం జరిగింది. శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శానిటేషన్ కాంట్రాక్టర్ గోకేడ రాంబాబు కుమార్తె దివంగత స్వర్ణభారతి జయంతిని పురస్కరించుకుని శానిటేషన్, సెక్యూరిటీ విభాగాల్లో పనిచేస్తున్న 78 మంది సిబ్బంది రక్తదానం చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాతలకు జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్ ప్రశంసా పత్రాలు అందజేశారు. రాంబాబు కుటుంబీకులు జీజీహెచ్‌లోని రోగులు, వారి బంధువులు 300 మందికి అన్నదానం చేశారు. ఆర్‌ఎంవో డాక్టర్ రాహుల్ సహా బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

కాకినాడ సిటీ: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా జిల్లా సీఐటీయూ ఆధ్వర్యంలో టీచర్స్ హోంలో రోటరీ క్లబ్ సహకారంతో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 83 మంది రక్తదానం చేశారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు జి.బేబీ రాణి, దువ్వా శేషుబాబ్జీ, తోకల ప్రసాద్ తదితరులు నివాళులర్పించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



నూకాలమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వసంత

కరప: కాకినాడలోని ఒకప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగికి మంగళవారం వలంటీర్ పింఛను అందజేశారు. నడకుదురు గ్రామానికి చెందిన నడికట్ల నూకాలమ్మ కిడ్నీ సమస్యతో కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. గ్రామ కార్యదర్శి పీఎస్ఆర్‌వీ బ్రహ్మానందం వలంటీర్ బోలెం వసంతకు ఈ విషయం చెప్పడంతో ఆమె కాకినాడ వెళ్లి రోగికి పింఛన్ అందజేశారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయండి



జూనియర్ కళాశాలల్లో నాడు-నేడు పనుల పురోగతిపై సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో జూనియర్ కళాశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని 14 జూనియర్ కళాశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనుల పురోగతిపై సమగ్ర శిక్షా అభియాన్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఆయా పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, డ్రాప్ అవుట్‌లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్‌ఐవో జీవీ నూకరాజు, సమగ్రశిక్ష అభియాన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ నటరాజన్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే బీసీలకు రాజ్యాధికారం

మత్స్యకార సొసైటీ జిల్లా అధ్యక్షుడు అప్పన్న



గరికిన అప్పన్న

కాకినాడ సిటీ: అధికారంలోకి రాక ముందు ఓ మాట, వచ్చాక మరో మాట చెప్పి బీసీలకు అన్యాయం చేసినది టీడీపీ నాయకులేనని వైఎస్సార్ సీపీ నాయకుడు, జిల్లా మత్స్యకార సొసైటీ జిల్లా అధ్యక్షులు గరికిన అప్పన్న విమర్శించారు. మంగళవారం సాయంత్రం ఆయన తూరంగి పగడాలపేటలోని ఆయన నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బీసీలను ఓటు బ్యాంకుగా వినియోగించుకుని అధికారంలోకి వచ్చాక వారికి అందుబాటులో ఉండని వారికి మాట్లాడే హక్కు లేదన్నారు. మరికొద్ది నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్లీ వారి ముందుకు రావడం టీడీపీ, జనసేన నాయకులకు సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. వెనుకబడిన వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీల మద్దతు వైఎస్సార్ సీపీకే ఉందని అప్పన్న అన్నారు. గత ఎన్నికల ముందు నిర్వహించిన బీసీ సదస్సులో జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన విధంగా గడిచిన మూడున్నరేళ్లలో బీసీలకు రాజ్యాధికారం కల్పించి, వారి అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నబాబుకు తిరుగులేదని, అన్ని వర్గాలు ఆయన గెలుపునకు కృషి చేస్తారని, జగన్‌ను తిరిగి సీఎం చేస్తారన్నారు.

వెబ్‌పేజీ రూపకల్పనపై శిక్షణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఫ్రంట్ ఎండ్ వెబ్ డిజైనింగ్‌పై ఐదు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో భాగంగా హెచ్‌టీఎంల్, జావా స్క్రిప్ట్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్ మంగళవారం తెలిపారు.

స్వామి వివేకానందకు నివాళులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి సాహితీవేత్త డాక్టర్ శిరీష, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రెడ్నం రాజా, రాఘవరావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పింగళి వెంకయ్యకు..

సర్పవరం జంక్షన్ బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, డాక్టరు శిరీష, చింతపల్లి సుబ్బారావు, రాజా తదితరులు నివాళులర్పించారు.

ఘనంగా వంగవీటి జయంతి

కరప: స్థానిక కొత్తపేటవీధిలో వంగవీటి మోహనరంగా జయంతిని కరప కాపు యూత్‌నాయకులు నిర్వహించారు. వైస్ ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు, వార్డు సభ్యులు కారపురెడ్డి రూపేంద్ర కుమార్, పేపకాయల శ్రీను కేక్ కట్‌చేసి, అందరికీ పంచారు.

6 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

కరప: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కరప పోలీసులు పాతర్లగడ్డ వద్ద మాటువేసి స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ నుంచి గొల్లపాలెం వైపు ఈ సరుకు తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ నాడు రామకృష్ణ, సిబ్బందితో కలసి ఆటోను తనిఖీ చేసి అందులోని 12 మూటలను పరిశీలించారు. ఆ మూటలను పీడీఎస్ బియ్యంగా గుర్తించారు. ఆటోతో సహా బియ్యాన్ని కరప పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎంఎస్‌ఓ టి.శ్రీనివాస్ పరిశీలించి పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు.